సాక్షి
వైఎస్సార్ జిల్లా
శుక్రవారం । 28 । ఏప్రిల్ । 2023



కమనీయం.. త్రిశూల చక్రస్నానం

పుష్పగిరిలో శ్రీకామాక్షీ వైద్యనాథేశ్వర స్వామి. శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వాముల బ్రహ్మోత్సవాలు గురువారం ముగిశాయి. -8లో..



కుక్క మొరిగిందని.. దాడి

మల్లెల గ్రామంలో కుక్క మొరిగిందనే కారణంతో ఇద్దరు యువకులు దంపతులపై కత్తులతో దాడికి పాల్పడ్డారు. -8లో..



ముగిసిన పది మూల్యాంకనం

పదో తరగతి సమాధాన పత్రాల మూల్యాంకనం గురువారంతో ప్రశాంతంగా ముగిసింది. -8లో..

న్యూస్‌రీల్

నేడు ఇన్‌చార్జి మంత్రి రాక

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ రాక నేపథ్యంలో శుక్రవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్ జిల్లాకు వస్తున్నట్లు కలెక్టర్ కార్యాలయానికి సమాచారం అందింది. శుక్రవారం ఉదయం 11.30 గంటలకు నెల్లూరు జిల్లా కావలి నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి మధ్యాహ్నం 2.00 గంటలకు కడప ఆర్‌అండ్‌బీ అతిథి గృహానికి చేరుకుంటారు. అక్కడ కాసేపు విశ్రాంతి తీసుకుంటారు. అనంతరం 2.40 గంటలకు ఆర్‌అండ్‌బీ అతిథి గృహం నుంచి బయలుదేరి 3.00 గంటలకు కడప ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ గవర్నర్‌కు స్వాగతం పలికి ఆయన కార్యక్రమాల్లో పాల్గొంటారు.

'ఎర్ర' స్మగ్లర్‌పై పీడీ యాక్టు



భాస్కర్‌రెడ్డి

కడప అర్బన్ : కరుడుకట్టిన అంతర్ రాష్ట్ర ఎర్రచందనం స్మగ్లర్ మండాది భాస్కర్‌రెడ్డిపై పీడీ యాక్టు ప్రయోగించారు. జిల్లాలోని ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన భాస్కర్‌రెడ్డిపై ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో ఐదు ఎర్రచందనం అక్రమ కేసులు ఉన్నాయి. తమిళనాడులోని వివిధ ప్రాంతాల నుంచి ఎర్రచందనం కూలీలను రప్పించి ఎర్రచందనం చెట్లను నరికి దుంగలుగా తయారు చేసి వాటిని చెన్నైలోని ప్రభుత్వ స్మగ్లర్లకు రవాణా చేసేవాడు. జిల్లా ఎస్పీ అన్బురాజన్ సిఫార్సు మేరకు కలెక్టర్ విజయరామరాజు పీడీ యాక్టు అమలుకు ఉత్తర్వులు జారీ చేశారు. ఎర్రచందనం అక్రమరవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

నియామకాలు

కడప అర్బన్ : రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో జిల్లా పోలీసు కంప్లెయింట్ అథారిటీ సభ్యుల నియామకాన్ని చేపట్టారు. కడప, కర్నూలు, నంద్యాల, అన్నమయ్య, తిరుపతి జిల్లాలకు సంబంధించి పోలీసు కంప్లెయింట్ అథారిటీ సభ్యులను ఒక బృందంగా ఏర్పాటు చేశారు. ఈ బృందంలో కర్నూలుకు చెందిన రిటైర్డ్ డీఎస్పీ కేవీ రాఘవరెడ్డి, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ సారెడ్డి శశిదేవి, ప్రొద్దుటూరు న్యాయవాది కాకర్ల నాగేశ్వరరెడ్డిలను నియమించారు.

రవాణాశాఖ ఆదాయ లక్ష్యం రూ.296.05



డీటీసీ మీరా ప్రసాద్

కడప వైఎస్ఆర్ సర్కిల్: రాష్ట్ర ప్రభుత్వం 2023–24 ఆర్థిక సంవత్సరానికి రవాణాశాఖ లక్ష్యం రూ.296.05 కోట్లు విధించినట్లు జిల్లా ఉప రవాణాశాఖ కమిషనర్ ఇ. మీరా ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం కడపలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ 2023–24 ఆర్థిక సంవత్సరంలో వైఎస్ఆర్ జిల్లాకు రూ.296.05 కోట్లు లక్ష్యంగా ప్రభుత్వం విధించిందన్నారు. ఇందులో త్రైమాసిక పన్నులు ద్వారా రూ.79.07 కోట్లు, జీవిత పన్నులు ద్వారా రూ176.64 కోట్లు, ఫీజులు ద్వారా రూ23.15 కోట్లు, తనిఖీల ద్వారా 11.97 కోట్లు, యూజర్ చార్జీల ద్వారా రూ.5.22 కోట్లు లక్ష్యంగా వసూలు చేయాలని ఆదేశించిందన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో వైఎస్ఆర్ జిల్లాలో రూ. 216.41 కోట్లు సాధించినట్లు తెలిపారు. ఈ ఏడాది నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించడానికి కృషి చేస్తామన్నారు. వాహన యజమానులు సకాలంలో పన్నులు చెల్లించాలన్నారు.

విరబూసిన విద్యా కుసుమాలు

ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు మార్కుల పంట



కవిత



ప్రీతిలతాదాల్



తల్లిదండ్రులతో మెహర్



తల్లిదండ్రులతో ప్రీతిలతాదాల్

మదనపల్లె సిటీ: కార్పొరేట్ కాలేజీలకు దీటుగా ఇంటర్మీడియట్‌లో పేద, సామాన్య కుటుంబాల పిల్లలు సగర్వంగా తలెత్తుకునే రీతిలో మార్కులు సాధించారు. ఒకప్పుడు ప్రభుత్వ కళాశాలల్లో చదివే పిల్లలు పాసైతే చాలు అనుకునేవారు. నేడు ఆ పరిస్థితి మారిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత కల్పించి, మౌలిక వసతులు కల్పించడంతో విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ కళాశాలల్లో చదివిన విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి అందరి మన్ననలు పొందారు.

కార్మికుడి ఇంట.. చదువుల తల్లి

మదనపల్లె పట్టణం అవంతి టాకీసు వద్ద నివాసం ఉంటున్న ఖాదర్‌వలి మెకానిక్. షర్మిల గృహిణి. సామాన్య కుటుంబం. కూతురు మెహర్ చిన్నప్పటి నుంచి చదువులో రాణిస్తోంది. పదో తరగతి స్థానిక హోప్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో చదివింది. పదిలో 590 మార్కులు సాధించింది. ఇంటర్మీడియట్ బాలికల జూనియర్ కాలేజీలో బైపీసీ చేరింది. ఇంటర్‌లో 968 మార్కులు వచ్చాయి.

రైతు బిడ్డ ..చదువులో దిట్ట

రైతు కుటుంబంలో పుట్టి చదువులో రాణిస్తోంది.సత్యసాయి జిల్లా కొక్కంటిక్రాస్ నల్లంవారిపల్లెకు చెందిన లింగారెడ్డి పద్మావతిల కుమార్తె కవిత. లింగారెడ్డి రైతు, పద్మావతి గృహిణి. కవిత మదనపల్లె జీఆర్‌టీ ఉన్నత పాఠశాలలో ఓపెన్ స్కూల్‌లో పదో తరగతి పాసైంది. ఇంటర్ బాలికల జూనియర్ కాలేజీలో బైపీసీ చేరింది. ఇంటర్‌లో 965 మార్కులు సాధించింది. కాలేజీ హాస్టల్‌లో ఉంటూ విద్యలో రాణించింది.

వాచ్‌మెన్ కూతురు..ఇంటర్‌లో టాపర్

తండ్రి వాచ్‌మెన్. తండ్రి పడుతున్న కష్టాలు చూసి చదువులో రాణించాలనుకుంది ప్రీతిలతాదాల్. మదనపల్లె ఎస్టేట్‌కు చెందిన దిగంబర్‌దాల్ ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నారు. ప్రీతి లతాదాల్ ప్రభుత్వ కళాశాలలో చదివి సీఈసీలో 948 మార్కులు సాధించించి అందరి మన్ననలు అందుకుంది.

బి.ఫార్మసీ చేయాలని ఉంది

ఎంసెట్, నీట్ ఎంట్రన్స్ రాస్తా. బి.ఫార్మసీ చేయాలని ఉంది.అధ్యాపకులు, తల్లిదండ్రుల సలహాలు, సూచనలతో మంచి మార్కులు సాధించా.

–మెహర్, మదనపల్లె

ఎంబీబీఎస్ చేస్తా

ఎంబీబీఎస్ చేయాలని ఉంది. ఇందు కోసం ఎంసెట్,నీట్ ఎంట్రన్స్‌లకు ప్రిపేర్ అవుతున్నా. అధ్యాపకులు ఇచ్చిన సలహాలు, సూచనలతో ప్రతి రోజు 9 గంటలు చదువుతున్నా.

–కవిత

ఐఏఎస్ కావాలన్నదే ధ్యేయం

సివిల్స్ రాసి ఐఏఎస్ కావాలన్నదే ధ్యేయం. అందుకే ఇంటర్మీడియట్ సీఈసీ చేరాను. అధ్యాపకులు రెడ్డప్ప రెడ్డి సూచనలు,సలహాలతో మంచి మార్కులు సాధించాను.

–ప్రీతిలతాదాల్

బేల్దారి కూతురు.. కాలేజీ టాపర్



తల్లిదండ్రులతో ప్రియాంక

రాజుపాళెం : మండలంలోని వెల్లాల బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు ప్రభంజనం సృష్టించారు. జమ్మలమడుగు మండలంలో కన్నెలూరు చెందిన సుబన్న, మేరిల కుమార్తె ప్రియాంక ఇంటర్ సెకండ్ ఇయర్ బైపీసీ గ్రూపు ఫలితాల్లో 1000 మార్కులకు 976 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచింది. 10వ తరగతి జమ్మలమడుగు గూడెంచెరువులోని కస్తూరిబా పాఠశాలలో చదివి 595 మార్కులు సాధించింది. బాలిక తండ్రి బేల్దారిగా పని చేస్తున్నాడు. భవిష్యత్తులో డాక్టర్ అయి పేదలకు సేవచేస్తానని ప్రియాంక చెప్పింది. ప్రియాంక తండ్రి సుబ్బన్న బేల్దారిగా పనిచేస్తున్నాడు, తల్లి మేరి కూలి పని చేసుకుని జీవిస్తున్నారు.

భవిష్యత్తులో డాక్టర్‌నవుతా



ముని జాహ్నవి

నంద్యాల జిల్లా సంజాముల మండలంలోని నొస్సం గ్రామానికి చెందిన బి.నాగేశ్వరరావు కుమార్తె బి.ముని జాహ్నవి ఇంటర్ సెకండ్ ఇయర్ బైపీసీగ్రూపులో ఫలితాల్లో 1000 మార్కులకు 976 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచింది. రాజుపాళెం మండలంలోని వెల్లాల బాలికల గురుకుల పాఠశాల పదోతరగతి నుంచి సీనియర్ ఇంటర్ వరకు చదివింది. బాలిక తండ్రి జూనియర్ లైన్‌మెన్‌గా, తల్లి అంగన్‌వాడీ టీచర్‌గా పని చేస్తున్నారు. భవిష్యత్తులో డాక్టర్ కావాలని ఉద్దేశంతో ప్రస్తుతం నీట్‌కు కోచింగ్ తీసుకుంటున్నట్లు మునిజాహ్నవి తెలిపింది.

వ్యవసాయ కూలీ బిడ్డ.. చదువులో దిట్ట



లక్ష్మిదేవి

రాజుపాళెం మండలంలోని వెల్లాల బాలికల గురుకుల పాఠశాల విద్యార్థి పామిడి లక్ష్మిదేవి సీనియర్ ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచింది. నంద్యాల జిల్లా చాగలమర్రి మండలంలోని నగళ్లపాడుకు చెందిన వ్యవసాయ కూలి పామిడి శ్రీనివాసులు కుమార్తె లక్ష్మిదేవి సీనియర్ ఇంటర్ బైపీసీ గ్రూపులో 1000 మార్కులకు 966 మార్కులు సాధించింది.. తండ్రి వ్యవసాయ కూలీ కాగా, తల్లి స్వాతి ఆశా కార్యకర్తగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం తిరుపతిలో నీట్ కోచింగ్ తీసుకుంటున్నానని, భవిష్యత్తులో డాక్టర్‌నవుతానని తెలిపింది.

దినకూలి ఇంట సరస్వతి పుత్రుడు



తల్లి అమరావతితో విద్యార్థి అశోక్‌కుమార్

తంబళ్లపల్లె: ఓ దినసరి కూలీ ఇంట చదువుల తల్లి సరస్వతి కొలువుదీరింది. ఆ ఇంటిలోని ఓ విద్యార్థి ఇంటర్‌మీడియట్ పరీక్ష ఫలితాల్లో ప్రతిభచాటి పలువురి మన్ననలు పొందాడు. మండలంలోని కొటాలకు చెందిన అమరావతి కూలీ పనులతో కుంటుంబ పోషణ సాగిస్తోంది. రెండో కుమారుడు ఇ.అశోక్‌కుమార్ ప్రాథమిక విద్య కొటాల ప్రభుత్వ పాఠశాలలో, గోపిదిన్నె ఉన్నత పాఠశాలలో పదోవ తరగతి పూర్తి చేసి 540 మార్కులతో ఉత్తీర్ణత సాధించాడు. అప్పటికే తల్లి పడుతున్న కష్టం చూసి అతనిలో బాగా చదవాలనే పట్టుదల పెరిగింది. తంబళ్లపల్లె ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ గ్రూపులో చేరాడు. ఇంటర్ ఫలితాల్లో 1000 మార్కులకు గాను 950 మార్కులు సాధించాడు. అతడి తండ్రి ఈశ్వరయ్య కోవిడ్‌తో మృతి చెందాడు.

ఐఏఎస్ చదవాలన్నదే ఆశయం

ఇంజినీరింగ్ విద్య పూర్తి చేసి ఐఏఎస్ కావాలన్నదే తన ఆశయమని అశోక్ కుమార్ తెలిపాడు. నేటి ప్రభుత్వం విద్యావ్యవస్థలో తీసుకొచ్చిన మార్పులు పేద పిల్లలకు ఇస్తున్న భరోసా తనకు ఆనందం కలిగిస్తోందన్నారు.

గవర్నర్ పర్యటనకు పక్కాగా ఏర్పాట్లు

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో పక్కాగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గవర్నర్ ముందుగా ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయాన్ని, అనంతరం కడప అమీన్ పీర్ దర్గాను దర్శించుకుంటారన్నారు.గవర్నర్ పర్యటించే ప్రాంతాల్లో ప్రోటోకాల్ ప్రకారం ఏర్పాట్లతో పాటు పటిష్టమైన పోలీసు బందోబస్తు ఉండాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్, డీఆర్వో గంగాధర్‌గౌడ్, ఆర్డీఓలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిరంతరం అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ

కడప అర్బన్: రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ జిల్లాలో ఈనెల 28న (శుక్రవారం) పర్యటిస్తున్న నేపథ్యంలో జిల్లా పోలీసు యంత్రాంగం ఆధ్వర్యంలో భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. ముందస్తుగా భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ గురువారం పర్యవేక్షించారు. నిరంతరం అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలనీ పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ ఆదేశించారు. ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్.ఎస్.ఎస్.వి కృష్ణారావు, ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేర్ణాకుమార్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఒంటిమిట్టలో ఏర్పాట్ల పరిశీలన



ఒంటిమిట్ట: వసతి గృహం వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

ఒంటిమిట్ట: రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ శుక్రవారం ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి వారిని దర్శించుకోనున్నారు. ఈనేపథ్యంలో ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ విజయరామరాజు, ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పరిశీలించారు. ముందుగా కలెక్టర్, ఎస్పీ స్వామి వారి దర్శించుకున్నారు. అనంతరం గవర్నర్ బసచేసే టీటీడీ వసతి గృహంలో వసతులను, ఆలయంలో ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. గవర్నర్ వచ్చే కాన్వాయ్ రూట్ రిహార్సల్, భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ జిల్లా పర్యటనలో భాగంగా మధ్యాహ్నం 3 గంటలకు కడప ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారని, అక్కడి నుంచి ఒంటిమిట్ట టీటీడీ గెస్ట్ హౌస్‌కి రోడ్డు మార్గంలో వస్తారన్నారు. 3:55– 4:25 మధ్య ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామిని దర్శనం చేసుకుంటారని తెలిపారు. అనంతరం బయలుదేరి కడపలోని అమీన్ పీర్ దర్గాకు చేరుకుంటారని వివరించారు.

వీరబ్రహ్మం ఆరాధనోత్సవాలు ప్రారంభం

- స్వామి వారికి ప్రత్యేక పూజలు
- భారీగా తరలివచ్చిన భక్తులు

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠంలో శ్రీ జగద్గురు మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన గురుపూజోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభం అయ్యాయి. తెల్లవారుజామున వీరబ్రహ్మ సుప్రభాతం, నామ సంకీర్తనాన్ని వేద పండితులు ఇడమకంటి జనార్దన శివాచార్య, పోలేపల్లి రామబ్రహ్మం ఆధ్వర్యంలో నిర్వహించారు. గర్భాలయంలోని మాతా గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి అర్చనామూర్తులకు గంగ, పంచామృతం, క్షీరం, ఫలోదకంలతో అభిషేకం చేశారు. ఈ అభిషేక తీర్థంను తీసుకెళ్లి పొలాల్లో పిచికారీ చేస్తారు. ఇలా చేస్తే చీడపీడలు తొలగుతాయని రైతుల నమ్మకం. అర్చనామూర్తులకు ప్రత్యేక వస్త్రాలంకరణ చేశారు. స్వామి గుణగణాలను కీర్తిస్తూ, 108 నామాలలో స్తుతిస్తూ సహస్ర నామార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం వేదపారాయణం చేశారు.

కమనీయంగా శేషవాహనోత్సం

రాత్రి శేషవాహనోత్సవం కమనీయంగా సాగింది. శేష అనగా పాము. దేహమందలి పామును అనగా వెన్నముకను పావన చేస్తే ఎలా షట్చక్ర దర్శనం జరుగుతుందో.. దానికి ప్రతీకగా ఈ వాహన సేవను స్వామి సన్నిధానంలో నిర్వహించడం ప్రత్యేకత. ఇందులో భాగంగా మాతా గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి పంచ శిరస్సులు గల శేషవాహనంపై ఆశీనులను చేశారు. పెద్దమఠం నుంచి జగన్మాత శ్రీ ఈశ్వరీదేవిమఠం వరకు ఊరేగింపు చేశారు. అక్కడ చిన్నమఠం మఠాధిపతి శ్రీవీరశివకుమారస్వామి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపు తిరిగి పెద్ద మఠం చేరుకుంది. ఉత్సవానికి ప్రొద్దుటూరు పట్టణ పరిధి గురువయ్యతోటలోని కాలేజ్ రోడ్డుకు చెందిన పేర్ల వెంకటబ్రహ్మానందరెడ్డి, గుంటూరు జిల్లా క్రోసూరుకు చెందిన చేపూరి నరసింహచారి, ఆయన భార్య విజయలక్ష్మి ఉభయదారులుగా వ్యవహరించారు. భక్తుల కాలక్షేపం కోసం వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్ర నుంచి సిద్దయ్య జ్ఞానమార్గం నాటకాన్ని ప్రదర్శించారు. వెంకటగిరికి చెందిన వెంకటగిరి నటరాజ నాట్య కళామండలి వారు ప్రదర్శించారు. వీరబ్రహ్మేంద్రస్వామిగా రంగనాథం, సిద్దయ్యగా జి.పోలయ్య చేసిన ప్రదర్శన భక్తులను విశేషంగా అలరించింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి, అమ్మవారిని దర్శించుకుని తరలించారు. స్వామి వారి శిష్యులు ఆరు రోజుల పాటు ఇక్కడే ఉండి, ఉత్సవ కార్యక్రమాలను తిలకించేందుకు గదులు అద్దెకు తీసుకున్నారు. దాతలు అన్నదానం, మజ్జిగ, వాటర్ ప్యాకెట్ల పంపిణీ కార్యక్రమాలు విరివిగా చేపట్టారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా మఠం ఫిట్‌పర్సన్ సి.శంకర్‌బాలాజి, మేనేజర్ ఎస్.ఈశ్వరయ్య ఆచారి ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వపు మఠాధిపతులు శ్రీ వీరభోగ వసంత వెంకటేశ్వరస్వామి కుమారులు శ్రీ వెంకటాద్రిస్వామి, భద్రయ్యస్వామి, వీరంబొట్లయ్యస్వామి, దత్తాత్రేయస్వామి,గోవిందుస్వామి, సోదరుడు శ్రీ వీరభద్రయ్యస్వామి తదితరులు పాల్గొన్నారు.



శేషవాహనంపై ఆశీనులైన స్వామి, అమ్మవారు

పట్టుదలకు మారుపేరు భగీరథ మహర్షి

కలెక్టర్ విజయరామరాజు



భగీరథ మహర్షి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ విజయరామరాజు తదితరులు

కడప సెవెన్‌రోడ్స్ : పట్టుదలకు, త్యాగానికి భగీరథ మహర్షి మరోపేరని కలెక్టర్ విజయరామరాజు అన్నారు. గురువారం భగీరథ మహర్షి జయంతిని కలెక్టరేట్ స్పందన హాలులో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. కలెక్టర్‌తోపాటు జేసీ గణేష్‌కుమార్, డీఆర్వో గంగాధర్‌గౌడ్, బీసీ సంక్షేమ అధికారి బ్రహ్మయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వెంకట సుబ్బయ్య తదితరులు భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాలలు సమర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎవరైనా కష్టపడి, పట్టుదలతో అనుకున్నది సాధిస్తే వారిని భగీరథునితో పోలుస్తారన్నారు. కఠోర శ్రమ చేసి దేన్నైనా సాధిస్తే భగీరథ యత్నం చేశారని కొనియాడుతారన్నారు. సగర కార్పొరేషన్ డైరెక్టర్ మురళీధర్, కడపజిల్లా సగర సంఘం అధ్యక్షుడు వీరమోహన్, రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షులు నీలం బాలగంగాధర తిలక్, కోశాధికారి విశ్వప్రసాద్, మార్కెట్ కమిటీ సభ్యులు వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.

విద్యావనం..అభివృద్ధి ఘనం

- రైల్వేకోడూరు వైఎస్సార్ ఉద్యాన కళాశాలకు ప్రత్యేక స్థానం
- రూ 14.59 కోట్లతో నూతన భవనాలు
- నేడు అకడమిక్, వసతి గృహాలు ప్రారంభిచనున్న మంత్రి కాకాని



ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న నూతన భవన సముదాయం



నూతన అరటి వంగడాల గురించి విద్యార్థులు, రైతులకు వివరిస్తున్న శాస్త్రవేత్తలు (ఫైల్)

ఓబులవారిపల్లె: రాయలసీమలోనే ఉద్యాన పంటలకు పేరుగాంచిన రైల్వేకోడూరు అనంతరాజుపేటలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ ఉద్యాన కళాశాల అభివృద్ధి పథంలో దూసుకెళుతుంది. మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2007లో ఉద్యాన కళాశాలను ఏర్పాటు చేశారు. పండ్లతోటల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తోంది. కళాశాల ఏర్పాటు చేసిన 15 సంవత్సరాల్లో ఎంతో పురోగతిని సాధించింది. తాజాగా శుక్రవారం కళాశాల ఆవరణలో దాదాపు 14.59 కోట్ల రూపాయలతో నిర్మించిన అకడమిక్ బ్లాక్ (ముడోదశ), బాలుర, బాలికల వసతిగృహం , పీజీ విద్యార్థుల వసతి గృహం(రెండో దశ)భవనాలతో పాటు వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) పరిపాలన భవనాలను శుక్రవారం వ్యవశాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి, శాసనమండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియా ఖానం, ఎంపీ మిథున్‌రెడ్డి, ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, వీసీ డాక్టర్ టీ జానకిరామ్ ప్రారంభించనున్నారు.


ఘన చరిత్ర కలిగిన ఉద్యాన కళాశాల

రైల్వేకోడూరు అనంతరాజుపేటలో ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వ విద్యాలయం ఘనచరిత్ర కలిగి ఉంది. అప్పట్లో మద్రాస్ ప్రెసిడెన్సీ సమయంలో 1935న పండ్ల పరిశోధన స్థానం పేరిట ఏర్పాటు చేశారు. 1935 మార్చి 1న స్థలాన్ని కేటాయించారు, డాక్టర్ కేసీ నాయక్ ఈ పరిశోధన స్థానం తొలి సూపరింటెండ్‌గా ఆగస్టు 3 నుంచి బాధ్యతలు చేపట్టారు. ఆగస్టు 4 నుంచి పనిచేయడం ప్రారంభమైంది. డిసెంబర్ 12న అధికారికంగా ప్రారంభించారు. దేశంలో సబూర్ (బీహార్), కృష్ణగిరి (పశ్చిమ బెంగాల్)లతో కలిసి మామిడి పరిశోధన స్థానంగా కొనసాగింది. 1960లో దేశంలోనే 8వ పండ్ల పరిశోధన స్థానంగా ఈ సంస్థను భారత వ్యవసాయ పరిశోధన మండలి(ఐకార్) గుర్తించింది. ఉష్ణమండల పండ్ల ఉత్పత్తి పెంపు, పండ్లతోటల్లో తెగుళ్ల నివారణ ప్రధాన లక్ష్యంగా ఈ సంస్థ పనిచేస్తోంది.

125 ఎకరాల్లో ఏర్పాటు

125 ఎకరాల్లో చెన్నై–హైదరాబాద్ జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేశారు. దక్షిణ మండల వ్యవసాయవాతవరణ స్థితిలో ఈ ప్రాంతం ఉంది. ఉద్యాన పంటల అభివృద్ధికి అవసరమైన మానవ వనరులను తీర్చిదిద్దడంలో అంకితమై పనిచేస్తోంది.బీఎస్సీ ఉద్యానకోర్సులు 2007–08లో, 2011–12 విద్యాసంవత్సరం నుంచి పీజీ, పీహెచ్‌డీ కోర్సులు ప్రారంభమయ్యాయి. 7 విభాగాల్లో పీజీ, 5 విభాగాల్లో పీహెచ్‌డీ కోర్సులు నిర్వహిస్తున్నారు. నిపుణులైన 8 మంది ప్రొఫెసర్లు, 9 మంది అసోసియేట్, 21 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు పనిచేస్తున్నారు. 11 మంది సహాయ, 36 మంది సాంకేతిక, 35 మంది ఇతర సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. కళాశాలలో అనేక వసతులతో పాటు ఆధునిక ప్రయోగశాలలు ఉన్నాయి. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక అంశాల్లో శిక్షణ పొందుతున్నారు. జేఆర్‌ఎఫ్, ఎస్ఆర్‌ఎఫ్‌లతో పాటు అనేక అంశాల్లో రాష్ట్ర , జాతీయ స్థాయి పతకాలు సాధిస్తున్నారు.

మరిన్ని వసతులు కావాలి



కళాశాల ఏర్పాటు చేసిన తక్కువ కాలంలో పురోగతి సాధించింది. ఈ ఏడాది 8 రాష్ట్రాల నుంచి విద్యార్థులు జాతీయ స్థాయిలో అడ్మిషన్ పొందారు. భవిష్యత్‌లో కళాశాలకు మరిన్ని వసతులు అవసరం. అంతర్జాతీయ విద్యార్థుల కోసం వసతి గృహం, ఏర్పాటు కావాల్సి ఉంది. ఉన్న సౌకర్యాలు మెరగుపరచుకుంటూ మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధిస్తాం.

– డాక్టర్ కే.గోపాల్, అసోసియేట్ డీన్, ఉద్యాన కళాశాల

బద్వేలు సబ్ రిజిస్ట్రార్‌పై కేసు నమోదు



శ్రీనివాసమూర్తి (ఫైల్)

బద్వేలు అర్బన్ : బద్వేలు సబ్‌రిజిస్ట్రార్ శ్రీనివాసమూర్తిపై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి గురువారం సాయంత్రం అదుపులోకి తీసుకున్నారు. బద్వేలు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అదనంగా డబ్బులు వసూలు చేయడంతో పాటు అవకతవకలు జరుగుతున్నట్లు వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో బుధవారం దాడులు చేసిన ఏసీబీ అధికారులు ముగ్గురు ప్రైవేటు వ్యక్తులు కార్యాలయంలో పనిచేస్తున్నట్లు గుర్తించడంతో పాటు కొంత మంది స్టాంపురైటర్ల వద్ద ఉన్న రూ.5 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి ఏసీబీ డీఎస్పీ కంజాక్షన్ నేతృత్వంలో దస్తావేజు లేఖర్లు, దస్తావేజు విక్రయదారులు, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బందిని బుధవారం అర్ధరాత్రి వరకు విచారించారు. తిరిగి గురువారం సాయంత్రం బద్వేలు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి చేరుకుని సబ్‌రిజిస్ట్రార్‌ను అదుపులోకి తీసుకుని కడపకు తీసుకెళ్లారు. అదుపులోకి తీసుకునే సమయంలో కార్యాలయంలో పనిచేసే సీనియర్ అసిస్టెంట్ రవి కి సబ్‌రిజిస్ట్రార్‌పై కేసు నమోదు చసి విచారణ నిమిత్తం కడపకు తీసుకెళుతున్నట్లు ఏసీబీ అధికారులు సమాచారమిచ్చినట్లు తెలిసింది. కాగా కార్యాలయంలో లభించిన నగదుకు సంబంధించి సబ్‌రిజిస్ట్రార్‌ను బాధ్యుడుగా గుర్తించి కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది.

జి.వి.ఫుట్‌బాల్ యాప్‌పై కేసు

కడప అర్బన్ : జి.వి.ఫుట్‌బాల్ యాప్ నిర్వాహకులపై కడప వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సుమోటోగా కేసు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ యాప్ పేరిట రోజూ వేల రూపాయలు సంపాదించుకోవచ్చంటూ పలువురు అమాయక ప్రజలను మోసం చేస్తున్నట్లు స్పెషల్ బ్రాంచ్ విభాగం ద్వారా తన దృష్టికి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. సైబర్ నేరగాళ్ల కొత్తరకం మోసం పట్ల అప్రమత్తంగా వుండాలని సూచించారు. జిల్లాలో మోసపోయిన బాధితులు జిల్లా ఎస్పీ కార్యాలయం 'స్పందన' వాట్సాప్ నంబర్ 9121100704 లేదా డయల్ 100 లేదా కడప ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. ప్రధానంగా జి.వి ఫుట్‌బాల్ యాప్, అనుమతుల్లేని ఇన్వెస్ట్‌మెంట్ యాప్‌ల పేరుతో పెట్టుబడి ముసుగులో మోసం చేస్తున్నారని వివరించారు.

మదనమోహనపురంలో ప్రబలిన జ్వరాలు

నందలూరు(రాజంపేట) : నందలూరు మండలం మదనమోహనపురంలో జ్వరాలు ప్రబలినాయి. కొందరు వేలూరు, చెన్నై, తిరుపతి తదితర ప్రాంతాల్లోని కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వారికి డెంగీ సోకినట్లుగా కార్పొరేట్ వైద్య సంస్థలు గుర్తించి చికిత్స అందిస్తున్నాయి. డెంగీ జ్వరాలని చికిత్స పొందుతున్నట్లుగా బాధితవర్గాలు తెలిపాయి. గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించి, తక్షణమే డెంగీ జ్వరాలను కట్టడి చేయాలని మండల వైద్యసిబ్బందిని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారిణి సృజన మాట్లాడుతూ గ్రామంలో వారం క్రితం పారిశుధ్య పనులు చేపట్టామన్నారు. జ్వరాలు ఉన్నాయని, అవి డెంగీ జ్వరాలు కాదని, మరింతగా వైద్య సేవలందిస్తామని తెలిపారు.

కుక్క మొరిగిందని.. దంపతులపై దాడి

పెద్దతిప్పసముద్రం : మండలంలోని మల్లెల గ్రామంలో కుక్క మొరిగిందనే కారణంతో ఆగ్రహించిన ఇద్దరు యువకులు దంపతులపై కత్తులతో దాడికి పాల్పడిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మల్లెల గ్రామానికి చెందిన రవీంద్ర (60), సుజాత (45)ల పెంపుడు కుక్క వీధిలో అటుగా వెళుతున్న ఇద్దరు యువకులను చూసి మొరిగింది. అటుగా ఎవరు వెళ్లినా కుక్క మొరిగి భయభ్రాంతులకు గురి చేస్తోందని ఆగ్రహించిన యువకులు కుక్క యజమాని రవీంద్రపై కత్తులతో దాడికి దిగారు. కత్తులతో తీవ్రంగా గాయపరుస్తున్న తన భర్తను కాపాడేందుకు భార్య వెళ్లి అడ్డుకోగా ఆమెపై కూడా దాడికి పాల్పడ్డారు. గాయపడిన దంపతులను స్థానికులు చికిత్స నిమిత్తం 108 వాహనంలో మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించారు. రవీంద్ర పరిస్థితి విషమంగా ఉండటంతో అత్యవసర విభాగం వైద్యులు మెరుగైన చికిత్స కోసం తిరుపతి ఆసుపత్రికి రెఫర్ చేసారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు పేర్కొన్నారు.

కమనీయం.. త్రిశూల చక్రస్నానం

ధ్వజావరోహణంతో ముగిసిన బ్రహ్మోత్సవాలు



నదిలో త్రిశూలం, చక్రాలకు అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు



శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవుని పుష్పయాగం



ధ్వజ అవరోహణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వేద పండితులు

వల్లూరు : పవిత్ర పుణ్యక్షేత్రమైన పుష్పగిరిలో తొమ్మిది రోజులుగా జరుగుతున్న శ్రీ కామాక్షీ వైద్యనాథేశ్వరస్వామి, శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వాముల బ్రహ్మోత్సవాలు గురువారం త్రిశూల, చక్ర స్నానం, ధ్వజావరోహణం కార్యక్రమాలతో ఘనంగా ముగిశాయి. శ్రీ వైద్యనాథేశ్వర స్వామి త్రిశూలం, శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి చక్ర తాళ్వార్‌ల స్నానాలను కమనీయంగా నిర్వహించారు. పుష్పగిరి గ్రామంలోని శ్రీ వైద్యనాథస్వామి ఆలయం నుంచి కామాక్షీ సహిత వైద్యనాథ స్వామిని, త్రిశూలాన్ని, కొండపైనున్న శ్రీ లక్ష్మీచెన్నకేశవ ఆలయం నుంచి శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామిని, చక్ర తాళ్వార్‌ను మేళ తాళాలు, డప్పువాయిద్యాలతో పల్లకీలో మోస్తూ ఊరేగింపుగా పెన్నా నది వద్దకు తీసుకుని వచ్చారు. అక్కడ భక్తులు స్వామివార్లకు కాయ కర్పూరాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రధాన అర్చకులు అఖిల్ దీక్షితులు, శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో స్వామి వార్ల త్రిశూలం, సుదర్శన చక్రాలకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. నదీ జలంలోకి సమస్త తీర్థాలను ఆవాహన చేసి మహా మంగళ హారతి ఇచ్చారు. పాలు, చందనం, నెయ్యి, పెరుగు, పసుపు, పన్నీరు, కొబ్బరి నీరుతో అభిషేకం చేశారు. అనంతరం త్రిశూల, చక్ర తాళ్వార్‌లకు తీర్థవాసి అవబృందోత్సవంను వేద మంత్రోచ్చారణలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారి చక్ర స్నానాలతోపాటుగా నదిలో స్నానాలు చేశారు. బ్రహ్మోత్సవాల ప్రారంభం రోజున కలశాలలో వుంచిన నవ ధాన్యపు మొలకలను శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి పెన్నా నదిలో కలిపారు. రెండు ఆలయాల్లో ధ్వజ అవరోహణం చేసి, పూర్ణాహుతితో బ్రహ్మోత్సవాలను ముగించారు. అనంతరం కుంభ సమారోపణ కార్యక్రమాన్ని, హోమాలను నిర్వహించారు. ఆర్య వైశ్య అన్నదాన సత్రం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

కనుల పండువగా పుష్పయాగం

రాత్రి శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామికి పుష్పయాగాన్ని కనుల పండువగా నిర్వహించారు. వివిధ రకాల పూలు, వేద మంత్రాలతో శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామికి నిర్వహించిన పుష్పయాగాన్ని చూసిన భక్తులు పులకించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు సుమంత్ దీక్షితులు, సుబ్బయ్య స్వామి, రాజేశ్వర శర్మ, శివస్వామి, ఆలయ ఛైర్మెన్ వెంకట సుబ్బారెడ్డి, ఆర్యవైశ్య అన్న దాన సత్రం అధ్యక్షుడు సుదర్శన్ రావు, సుబ్బయ్య, ఉభయదారులు పాల్గొన్నారు.

చక్రస్నాన విశిష్టత

హరి హరుల ఆయుధాలైన త్రిశూల, సుదర్శన చక్రాలకు ఒకే సారి స్నాన ఉత్సవాలు నిర్వహించడం పుష్పగిరి ప్రత్యేకత. పుష్పగిరి బ్రహ్మోత్సవాలలో భాగంగా జరిగే ఈ ఉత్సవంలో పాల్గొని స్నానాలాచరిస్తే చేసిన పాపాలన్నీ తొలగి పవిత్రంగా మారతారని అర్చకులు అఖిల్‌దీక్షితులు తెలిపారు. చక్ర స్నానం జరిగే సమయంలో నదిలో నీరు గలగలా కాకుండా హరి హర అనే శబ్దంతో ప్రవహిస్తూ స్నానం చేసిన వారికి ముక్కోటి తీర్థాలలో చేసిన స్నానంతో సమానమైన పుణ్యం లభిస్తుందని వేదాలు తెలుపుతున్నాయని ఆయన వివరించారు. అంతేకాక వారి జన్మ సార్థక మవుతుందని కూడా వేదాలు ఘోషిస్తున్నాయని వివరించారు.

భార్యపై భర్త దాడి

మదనపల్లె : భార్యపై భర్త దాడి చేసి గాయపరచిన సంఘటన గురువారం నిమ్మనపల్లె మండలంలో జరిగింది. నిమ్మనపల్లె గ్రామానికి చెందిన రవి భార్య హేమలత (30) కూలీ పనులు చేస్తూ జీవిస్తోంది. ఆమె భర్త రవి హమాలీ పనులు చేస్తున్నాడు. అయితే మద్యానికి బానిసైన రవి బుధవారం రాత్రి భార్య చెవిలోని బంగారు లాక్కెళ్లి కుదువపెట్టి అతిగా మద్యం సేవించాడు. మిగిలిన నగదు పేకాటలో పోగొట్టాడు. విషయం తెలుసుకున్న భార్య హేమలత గురువారం భర్తను నిలదీసి మందలించింది. ఈ విషయమై ఇద్దరూ గొడవపడ్డారు. ఆవేశానికి గురైన రవి కర్రతో భార్యపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. గమనించిన స్థానికులు బాధితురాలిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పరీక్ష ఫెయిల్ అయ్యానని ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : ఇంటర్ పరీక్షా ఫలితాల్లో ఫెయిల్ కావడంతో మనస్తాపం చెందిన ఓ విద్యార్థి ఆత్మహత్యకు ప్రయత్నించిన సంఘటన గురువారం మొలకలచెరువు మండలంలో జరిగింది. దేవళచెరువు పంచాయతీ పర్తికోటకు చెందిన దేవుడప్ప కుమార్తె గీతశ్రీ (16) మదనపల్లెలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. కాగా బుధవారం సాయంత్రం విడుదలైన పరీక్షా ఫలితాల్లో ఒక సబ్జెక్టులో ఫెయిల్ అయ్యింది. దీంతో మనస్తాపం చెందిన విద్యార్థిని పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన స్థానికులు బాధితురాలిని 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్సల అనంతరం కోలుకుంటోంది.

కమలాపురం డిగ్రీ కళాశాలకు న్యాక్ ఏ గ్రేడ్

కమలాపురం : స్థానిక సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాలకు న్యాక్ 'ఏ' గ్రేడ్ వచ్చినట్లు కళాశాల కరస్పాండెంట్ రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం తన చాంబర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. 2017లో వైవీయూ పరిధిలో బీప్లస్ న్యాక్ గ్రేడ్ వచ్చిన ఏకైక కళాశాల తమదేనన్నారు. ఐదేళ్ల తర్వాత నిర్వహించిన సెకండ్ సెల్‌లో తిరిగి తమ కళాశాలకు న్యాక్‌లో ఏ గ్రేడ్ వచ్చిందన్నారు. వైవీయూ పరిధిలో న్యాక్ ఏ గ్రేడ్ సాధించిన ప్రైవేట్ అన్ ఎయిడెడ్ కళాశాల తమది మాత్రమేనన్నారు. ఈ ఐదేళ్లలో తమ కళాశాలలో అన్ని రకాల వసతులు మెరుగు పరిచామన్నారు. ఈ నెల 12, 13వ తేదీల్లో న్యాక్ పీర్ టీం ప్రీతి బజాజ్, తార్‌నాథ్, అముతా పాండ్యన్‌లు తమ కళాశాలలో పర్యటించి వసతులు, ల్యాబ్, లైబ్రరీ, ఫ్యాకల్టీ, గ్రీనరీ తదితర అన్ని విషయాలను పరిశీలించి గ్రేడింగ్ ఇచ్చారన్నారు.



న్యాక్ ఏ గ్రేడ్ సర్టిఫికెట్‌ను చూపిస్తున్న కరస్పాండెంట్ రాజగోపాల్ రెడ్డి

ఆన్‌లైన్ అసెస్‌మెంట్, పీర్ టీం అసెస్‌మెంట్‌లో 3.22 ఫోర్‌స్కేల్‌లో ఏ గ్రేడ్ ప్రకటించడం జరిగిందని సంతోషం వ్యక్తం చేశారు. సమావేశంలో ప్రిన్సిపల్ డాక్టర్ వినోద్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ డా.పల్లాకృష్ణ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ వినయ్ కుమార్ పాల్గొన్నారు.

భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠంలోని శ్రీ జగద్గురు మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన, గురుపూజ మహోత్సవాల్లో భాగంగా ఈ నెల 29, 30, మే 1న సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు స్వామి మాడ వీధుల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చిన్న చిన్న అంగళ్లను తొలగిస్తామని ఎస్ఐ విద్యాసాగర్ తెలిపారు. గురువారం ఎంపీపీ సి.వీరనారాయణ రెడ్డి విలేకరులతో కలసి దేవస్థానం నిర్వాహకులు ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు, తాగునీటి సౌకర్యాలపై పరిశీలించారు. అక్కడికి చేరుకున్న ఎస్ఐ మాట్లాడుతూ భక్తులకు ఈ మూడు రోజులు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు



స్థానిక నాయకులతో మాట్లాడుతున్న ఎస్ఐ విద్యాసాగర్

లేకుండా మైదుకూరు రూరల్ సీఐ నరేంద్రరెడ్డి, డీఎస్పీల ఆదేశాల మేరకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇప్పటికే పలు కూడళ్లలో ఎక్కడ బందోబస్తు ఏర్పాటు చేయాలన్న దానిని గుర్తించామన్నారు. ఎంపీపీ సి.వీరనారాయణ రెడ్డి మాట్లాడుతూ దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు తాగునీరు, చలువ పందిళ్లు, స్నానపు ఘట్టాలను తక్షణం ఏర్పాటు చేయాలని దేవస్థాన నిర్వాహకులను కోరారు. కొంత మంది ప్రతిపక్ష నాయకులు భక్తులకు ఏర్పాటు చేసిన చలువ పందిళ్లలో కూడా రాజకీయం చేస్తున్నారని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అలాంటి విధానాలను ఎప్పుడు ప్రోత్సహించదని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం మేనేజర్ ఈశ్వరయ్య ఆచారి, స్థానిక నాయకులు నాగార్జుననాయుడు, జోగయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పది మూల్యాంకనం

కడప ఎడ్యుకేషన్ : పదో తరగతి సమాధాన పత్రాల మూల్యాంకనం గురువారంతో ప్రశాంతంగా ముగిసింది. పాఠశాల విద్యాశాఖ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ నెల 19వ తేదీ నుంచి మూల్యాంకనాన్ని ప్రారంభించారు. 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఏప్రిల్ 3వ తేదీ నుంచి 18వ తేదీ వరకు నిర్వహించారు. వైఎస్సార్ జిల్లా వ్యాప్తంగా 146 పరీక్షా కేంద్రాలలో ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాలకు సంబంధించి 27,211 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. ఇందులో 14,107 మంది బాలురు, 13,104 మంది బాలికలు ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 18వ తేదీలో పది పరీక్షలు ముగిశాయి. 19వ తేదీ నుంచి కడపలోని మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌లో మూల్యాంకనాన్ని ప్రారంభించారు. సంబంధిత మూల్యాంకనం 27వ తేదీ ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల నుంచి తెలుగు, హిందీ, ఇంగ్లిషు, మ్యాథ్స్, ఫిజికల్ సైన్సు, బి.సైన్సు, సోషియల్, ఉర్దూ, హిందీ, తెలుగు, సంస్కృతంకు సంబంధించి 2,04,568 సమాధాన పత్రాలు మూల్యాంకనానికి వచ్చాయి. 209 మంది చీఫ్ ఎగ్జామినేటర్లు, 627 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు, 209 మంది స్పెషల్ అసిస్టెంట్లు విధుల్లో పాల్గొని సమర్థవంతంగా మూల్యాంకనాన్ని పూర్తి చేశారు. మూల్యాంకనంలో సిబ్బంది ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పది పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ వెంకటేషులు, డీఈఓ రాఘవరెడ్డి అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేశారు. పది పరీక్షల జిల్లా పరిశీలకులు వెంకట క్రిష్ణారెడ్డి మూల్యాంకన కేంద్రాన్ని సందర్శించి సిబ్బందికి అవసరమైన సలహాలు, సూచనలు ఇచ్చారు. అందరి సమన్వయంతో పది మూల్యాంకనాన్ని విజయవంతంగా పూర్తి చేసినట్లు డీఈఓ రాఘవరెడ్డి తెలిపారు.

సౌత్‌జోన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

కడప స్పోర్ట్స్ : ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ పరిధిలో సౌత్‌జోన్‌ను అన్నింటా అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతామని సౌత్‌జోన్ చైర్మన్ కె.పురుషోత్తంరావు, కన్వీనర్ అవ్వారు రెడ్డిప్రసాద్ పేర్కొన్నారు. గురువారం కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ స్టేడియంలోని కార్యాలయంలో సౌత్‌జోన్ నూతన చైర్మన్‌గా అపెక్స్ సభ్యుడు కె.పురుషోత్తంరావు, కన్వీనర్‌గా సీఏవైడీ కార్యదర్శి రెడ్డిప్రసాద్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలో కడప వేదికగా ఆంధ్రా ప్రీమియర్ లీగ్ మ్యాచ్‌లు నిర్వహించనున్నట్లు తెలిపారు. సౌత్‌జోన్ మ్యాచ్‌ల నిర్వహణలో పాటించాల్సిన అంశాలను వివరించారు. స్టేడియం నిర్మాణం పూర్తయి 10 ఏళ్లు దాటిన నేపథ్యంలో స్టేడియంలో చేపట్టాల్సిన నిర్మాణ పనులు, మరమ్మతులపై మార్గనిర్దేశం చేశారు. అనంతరం నూతన



సౌత్‌జోన్ చైర్మన్ పురుషోత్తంరావును సన్మానిస్తున్న సీఏవైడీ ప్రతినిధులు

చైర్మన్, కన్వీనర్‌లను క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్ఆర్ డిస్ట్రిక్ట్ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో క్రికెట్ సంఘం ప్రతినిధులు వై.శివప్రసాద్, అబ్దుల్ ఫరూఖ్ రెహమాన్, అనంతపురం జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి, సీతాపతి, ప్రసాద్, శివ, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌కు విశేష స్పందన



మాట్లాడుతున్న సెంచూరీ ప్యానల్ జీఎం రమేష్‌రెడ్డి

బద్వేలు అర్బన్ : బద్వేలు సమీపంలోని గోపవరం ప్రాజెక్టు కాలనీ వద్ద నూతనంగా నిర్మిస్తున్న సెంచూరీ ప్యానల్ పరిశ్రమలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు గురువారం స్థానిక ఎస్.వి.సి.ఎం పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో నిర్వహించిన క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌కు విశేష స్పందన లభించింది. ఈ ఇంటర్వ్యూలకు నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి సుమారు 200 మందికి పైగా డిప్లామా మెకానికల్, ఎలక్ట్రికల్ విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సెంచూరీ ప్యానల్ జీఎం రమేష్‌రెడ్డి, హెచ్‌ఆర్ శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ సెంచూరీ ప్యానల్‌లో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహించామని, హాజరైన విద్యార్థులకు రాత పరీక్ష నిర్వహించి అనంతరం మౌఖిక పరీక్ష ద్వారా ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డాక్టర్ శ్రీనివాస్‌కుమార్, ప్రిన్సిపల్ చంద్రమోహన్, కళాశాల ఏఓ శివ, మెకానికల్ డిపార్ట్‌మెంట్ హెడ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి స్థలం కోసం దౌర్జన్యం

కడప అర్బన్ : కడప నగర శివారులోని వికలాంగుల కాలనీలో ఇంటి స్థలం కోసం దౌర్జన్యానికి పాల్పడ్డారు. నిర్మాణంలో వున్న ఇంటి తాళం పగులగొట్టి ముగ్గురు వ్యక్తులు లోపలికి ప్రవేశించారని బాధితుడు మణికంఠ పోలీసులను ఆశ్రయించాడు. దీంతో వెంటనే స్పదించిన కడప రిమ్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బ్లూకోల్ట్స్ వారు సంఘటన స్థలానికి గురువారం చేరుకున్నారు. బాధితుడు మణికంఠ మీడియాకు వివరాలను తెలియజేశాడు. వికలాంగుల కాలనీలో తోటంశెట్టి సుబ్రమణ్యం పేరుతో వున్న స్థలం కొనుగోలు చేశామని, అందులో రెండస్తుల భవనాన్ని రూ.20 లక్షలకు పైగా ఖర్చు చేసి నిర్మిస్తున్నట్లు తెలిపాడు. ఎర్రగుంట్లకు చెందిన ముగ్గురు వ్యక్తులు ఐదు రోజుల క్రితమే ఇంటి తాళం పగులగొట్టి, అక్రమంగా ప్రవేశించి అక్కడే మద్యం సేవిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయాడు. ఈనెల 20న స్పందనలో ఎస్పీకి, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. ఇంటిలో దౌర్జన్యంగా వున్న ముగ్గురు వ్యక్తుల్లో శివను పోలీసులు స్టేషన్‌కు తీసుకుని వచ్చారు. ఈ సంఘటనపై కడప రిమ్స్ పోలీసులు మాట్లాడుతూ బాధితుడి ఫిర్యాదు మేరకు స్థలం ధ్రువీకరణ సర్టిఫికెట్ కోసం కడప తహసీల్దార్‌కు లెటర్‌ను పంపించామని తెలియజేశారు.